క్లుప్తంగా

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించాలి



అమరాపురం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అమరాపురం: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఉదుగూరు, కాచికుంట గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. అక్కడ బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల నెట్ వర్క్ లీడర్ శంకర్, అంబేద్కర్ కమిటీ మండల అధ్యక్షుడు నారాయణప్ప, తాలుకా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కెంచప్ప మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనరసింహకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పుష్పలత, నాగమణి, పవిత్ర, జ్యోతి, రేఖ, లక్ష్మీదేవి, శాంతమ్మ, శివమ్మ, కరియమ్మ, సాకమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గౌడ చంద్రమ్మకు జలధి పూజ



జలధి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని కెంకర గ్రామంలో వడ్డెర్లు ఆరాధ్య దేవత గౌడ చంద్రమ్మదేవికి సోమవారం జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని మేళ తాళాలతో ఊరేగింపుగా గ్రామ పొలిమేర వద్దకు తీసుకొచ్చి గంగా జలంతో శుద్ధి చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి, మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ఆలయానికి తిరిగింపు చేశారు. కెంకెర గ్రామంలో వడ్డెర కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం హారతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రారంభమైన రిలే దీక్షలు



పెనుకొండలో రిలేదీక్షలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం రిలేదీక్షలు ప్రారంభించారు. తమ న్యాయపరమైన సమస్యలను మేనేజ్‌మెంట్ వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్మికులందరూ కలసికట్టుగా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ రామకృష్ణ, నాయకులు మల్లికార్జున, షాహిద్, ప్రభాకర్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ దీక్షలు చేపట్టారు. దీక్షలు మంగళవారం కూడా కొనసాగుతాయి. తొలి రోజు ఈ దీక్షలో ఎన్ఎంయూ అధ్యక్షుడు ముద్దప్ప, సంయుక్త కార్యదర్శి జయసింహ, సభ్యుడు నాగరాజు తదితరులు ఈ దీక్షలో పాల్గొన్నారు.

నారనాగేపల్లికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు

రొద్దం: మండలంలోని నారనాగేపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. సోమవారం నుంచి హిందూపురం డిపోనకు చెందిన బస్సును నడుపనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఇటీవల గ్రామస్తులు బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రికి బస్సు కోసం విన్నవించుకున్నారన్నారు. స్పందించిన మంత్రి బస్సు సౌకర్యం కల్పించారన్నారు. హిందూపురం నుంచి కలిపి మీదుగా ఉదయం 7 గంటలకు నారనాగేపల్లికి బస్సు చేరుకుంటుందన్నారు. సాయంత్ర 6 గంటలకు మళ్లీ గ్రామానికి బస్సు వెళ్తుందన్నారు. బస్సు గ్రామానికి రావడంతో గ్రామస్తులు స్వీట్లు పంచుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి



రెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రొద్దం: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నరేంద్ర సూచించారు. ఆదివారం రాత్రి మండలంలోని రెడ్డిపల్లిలో పోలీసులు పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అన్నదమ్ములాగా, ప్రశాంతగా జీవించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మత్తు పదార్థాల వల్ల అనర్థాలు, సైబర్ మోసాలు గురించి అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్‌లు, లోన్ యాప్ ఫ్రాడ్స్ తదితర అంశాలపై వివరించారు.

అయ్యో..కుయ్యో..మొర్రో

- 108 వాహనం లేక అమరాపురం ప్రజలకు తిప్పలు
- అత్యవసర చికిత్సకు వెళ్లాలంటే అవస్థలే!
- ప్రైవేట్ వాహనాలకు బాడుగ ఇచ్చుకోలేక సతమతం



బాధితుడిని ప్రైవేటు వాహనంలో తీసుకెళ్తున్న దృశ్యం



రోడ్డు ప్రమాద బాధితులను ప్రైవేటు వాహనంలో తీసుకొచ్చిన దృశ్యం (ఫైల్)



మరమ్మతుకు వెళ్లిన అమరాపురం 108 వాహనం

అమరాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆపద అనగానే 108 వాహనం గుర్తుకొచ్చేది. ఏ క్షణంలో అత్యవసరమని సమాచారం అందిస్తే చాలు.. నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకుని రోగులను, క్షతగాత్రులు, గర్భిణులు ఇలా..అందరినీ ఆస్పత్రులకు చేర్చేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 108 వాహనం మరమ్మతుకు గురైంది. అయ్యో..కుయ్యో..మొర్రో అనాల్సిన పరిస్థితి వచ్చింది. అంబులెన్స్ లేక.. పట్టించుకునేవారు లేక అవస్థలు పడుతున్నామని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమరాపురం మండలంలో 52 వేలకు పైగా జనాభా ఉంది. మండలం కర్ణాటక సరిహద్దులో ఉంది. దీంతో పాటు జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉంది. దీంతో ఇక్కడ ఎలాంటి అంబులెన్స్ వాహనాలు దొరకవు. మండలానికి కేటాయించిన 108 వాహనం మరమ్మతుకు గురైంది. ఉన్న అంబులెన్స్ కూడా రిపేరీకి రావడంతో గతేడాది డిసెంబర్ నెల నుంచి ఇక్కడ వాహనం అందుబాటులో లేదు. మండల ప్రజలకు ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగినా, అత్యవసర చికిత్స కోసమైనా, ఆపద సమయాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నా, లేదా ఇతర ఆస్పత్రులకు వెళ్లాలన్నా 108 వాహనం అత్యవసరం. అంబులెన్స్ లేక మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో రోగులను, ప్రమాదాలకు గురైన వారిని ,లేదా ఇతర ఆస్పత్రులకు తీసుకెళ్లాలన్నా ప్రైవేట్ వాహనాలకు అధిక మొత్తంలో బాడుగు చెల్లించుకోలేక పేద ప్రజలు అవస్థలు పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను గుర్తించి అమరాపురం మండలానికి 2020లో 108 వాహనాన్ని కేటాయించారు. అప్పటి నుంచి గతేడాది డిసెంబర్ నెల వరకు సక్రమంగా సేవలు అందాయి. అయితే 108 వాహనం మరమ్మతుకు నోచుకోవడంతో అనంతపురం వెళ్లిన వాహనం.. ఇంత వరకూ తిరిగి మండల కేంద్రానికి రాలేదు.

108 వాహనం ఉండాలి



ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు నిత్యం కూలీ పనులు చేసి కుటుంబాలు పోషించుకుంటున్నారు. అందరూ పేదలే. అయితే ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినా, అత్యవసర సమయాల్లో ఫోన్ చేయగానే కుయ్, కుయ్ అని సమయానికి చేరుకునేది. ప్రస్తుతం అంబులెన్స్ మండలంలో కనిపించలేదు. అధికారులు వీలైనంత త్వరగా వాహనాన్ని కేటాయించాలి.

– రాజప్ప, వ్యవసాయ కూలీ, గౌడనకుంట, అమరాపురం మండలం

మహిళలకు అవస్థలు



మండలంలో బాలింతలు, ప్రసవానికి వెళ్లాల్సిన గర్భిణులకు 108 వాహనం చాలా అవసరం. ఐదు నెలల నుంచి 108 వాహనం లేక పోవడంతో చాలా మంది డబ్బులేక పోయినా అప్పు చేసి ప్రైవేట్ వాహనాలను పిలిపించుకోవాల్సి వస్తోంది. వారు ఎంత చెబితే అంత ఇవ్వాల్సి వస్తోంది. 108 వాహనం ఉంటే మాలాంటి పేదలకు ఎంతో మేలు జరిగేది. సత్వరమే 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలి.

– లక్ష్మీదేవి, అమరాపురం

అందుబాటులో ఉంచాలి



కర్ణాటక సరిహద్దులోని మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 108 వాహనాన్ని కేటాయించింది.అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాహనం మరమ్మతు చేయించలేదు. మళ్లీ ఆ వాహనం మండలానికి రాలేదు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వాహనం లేక పోవడంతో మా స్నేహితుడిని ప్రైవేట్ వాహనంలో పంపించాల్సి వచ్చింది.

– గోవిందరాయ, వలస, అమరాపురం మండలం



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	36.0
పెనుకొండ	39.0
మడకశిర	36.0

శంకర్‌నారాయణకు సత్కారం



శంకరనారాయణను సత్కరిస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు

రొద్దం: వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణను సోమవారం రొద్దం ప్రజాప్రతినిధులు పెనుకొండ క్యాంప్ కార్యాలయంలో శాలువాలతో సత్కరించారు. పార్టీ అడ్వైజరీ కమిటీలో శంకరనారాయణకు స్థానం కల్పించినందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయి తాగునీరు కలుషితం కావడంపై సోమవారం 'పైప్‌లైన్‌కు లీకేజీ' అన్న కథకం సాక్షిలో ప్రచురితమైయింది. స్పందించిన, పంచాయతీ కార్యదర్శి, ఈఓఆర్డీ గోవిందప్ప పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి, లీకేజీని అరికట్టారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు చెప్పారు.

సాక్షి ఎఫెక్ట్..

చెత్త తొలగింపు



రొళ్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో చెత్త తొలగించిన దృశ్యం

రొళ్ల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొని ఉండేది. సోమవారం 'సాక్షి'లో 'చెత్త ఎత్తరు..సంపద సృష్టించరు' శీర్షికన ప్రచురితమైంది. అధికారులు స్పందించి మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్య కార్మికులతో తొలగించారు. మండల వ్యాప్తంగా పది పంచాయతీలో 10 సందప తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రజలు వృథాగా పడి వేసే చెత్తను తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని అధికారులు ఆదేశించారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

హిందూపురం అర్బన్: పహల్గాంలో పర్యాటకులను అంతమొందించిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని హిందూపురం బార్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నూరప్ప ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వన్నూరప్ప, రామచంద్రప్ప మాట్లాడుతూ ఉగ్రదాడిని భారతీయులందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, ఇందాద్, శ్రీనివాస రెడ్డి, రాజశేఖర్, సుదర్శన్, నాగరాజురెడ్డి, ప్రసాద్ రెడ్డి, సిద్ధూ, శ్రీరాములు, నాగేంద్ర, కృష్ణమూర్తి, రకీబ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పెనుకొండ: నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు డీవైఈఓ సోనీకి సోమవారం వినతి పత్రం అందించారు. జిల్లా కార్యదర్శి బాబావలి, జిల్లా ఉపాధ్యక్షులు హర్షకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పాఠశాలలోనే నోటు పుస్తకాలు, యూనిఫాంలు, టైలు, షూలు, ఇతర సామగ్రి విక్రయిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. ఫిట్నెస్ లేని బస్‌లు నడుపుతున్నారన్నారు. బస్‌లలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తూ.. పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, తజంబుల్, బాబావలి, చిన్న, రిహాన్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభ సంప్రోక్షణ



కొత్తపాళ్యంలో పూజలందుకున్న వెంకటేశ్వరస్వామి

రొళ్ల: మండలంలోని కొత్తపాళ్యం (కొత్త తిరుపతి)లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభ సంప్రోక్షణ పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేదపండితులతో భగవతే ప్రార్థన, సభాప్రార్థన, స్వస్తివాచనం, పుణ్యాహావాచనం, రక్షాబంధనమ్, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, వాస్తు హోమం, 29న సుప్రభాత సేవలు, వేదపారాయణమ్, ధ్వజకుంభ ఆరాధన, మహాకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, శ్రీదేవి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం, తీర్థప్రసాద వినియోగం, 30న యాగశాల పూజలు, మహాకుంభ సంప్రోక్షణ, ప్రథమ ఆరాధన, మహానైవేద్యం, కల్యాణ మహోత్సవం, మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. అదే రోజు ఆలయ సమీపంలో కేటీడీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నారు. భక్తులు పూజల్లో పాల్గొనాలని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం

అగళి: పోషకాహారంతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి తెలిపారు. సోమవారం వెలుగు కార్యాలయంలో పోషణ్ పక్వాడాపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ మహిళలు గర్భస్థ దశ నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్ల వరకు చేపట్టే సంరక్షణపై వివరించారు. సర్పంచ్ లక్ష్మమ్మ, ఏపీఎం సురేష్, జెడ్పీటీసీ ఉమేష్ పాల్గొన్నారు.

లేపాక్షి: గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలని సీడీపీఓ శాంతి, వైద్యాధికారి వెంకట చిరంజీవి సూచించారు. సోమవారం లేపాక్షిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం,, 6 నెలలు నిండిన బిడ్డలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు.

సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రొద్దం: మండలంలోని కోగిర రెవెన్యూ పొలం సర్వే నంబర్ 669లోని ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ మండలంలోని కోగిర, శ్యాపురం, కంబాలపల్లి, బీదానిపల్లి, బొక్సంపల్లి గ్రామాలకు చెందిన భూమి లేని 150 కుటుంబాల నిరుపేద రైతులు ఒక్కొక్కరు 3 ఎకరాల నుంచి 5 ఎకరాలు గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారన్నారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీ మేరకు సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దార్ ఉదయ్‌శంకరాజు రికార్డుల మేరకు చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఆందోళన విరమించారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నారాయణప్ప, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం నిరసన

పెనుకొండ రూరల్: ఇంటి పట్టాలు, సాగు భూములకు పట్టా పాసు పుస్తకాలం కోసం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. సాగు చేస్తున్న భూములకు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని తహసీల్దార్ శ్రీధర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు హరి, బాబావలి, గంగాధర్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపిక జన్మదిన వేడుకలు



టీఎన్ దీపికకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల నడుమ కేక్ కట్ చేశారు. పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులుల పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న టీడీపీ



మాట్లాడుతున్న నరసింహామూర్తి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం కేసుకోవడానికి టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తుండడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి అన్నారు. సోమవారం ఆయన మడకశిరలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. మడకశిరలో ప్రజాస్వామ్యాన్ని టీడీపీ నాయకులు అపహాస్యం చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన చైర్ పర్సన్, వైస్ చైర్మన్లను పదవి నుంచి దించడానికి టీడీపీ నాయకులు అడ్డదారుల్లో ప్రయత్నించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను మభ్యపెట్టి అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడం తగదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో గెలిచి మున్సిపాలిటీలో పాలన చేయాలని టీడీపీ నాయకులకు హితవుపలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికి చేతగాక కూటమి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

అగళి: మండలంలోని ఇరిగేపల్లి , ఇనగలూర గ్రామాల్లో చేస్తున్న ఉపాధి పనులను ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందిపై సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇంతవరకు జరిగిన, జరగబోవు పనులపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 ఫిర్యాదులు

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఆర్డీవో ఆనంద్ కుమార్ నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా రెవెన్యూ, గృహ నిర్మాణాలు, రేషన్ కార్డు సమస్యలపై 14 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

మడకశిరలో 39 ఎంఎం వర్షపాతం

మడకశిరరూరల్: నియోజకవర్గంలో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం పడింది. మడకశిర మండలంలో 39.6 ఎంఎం, అమరాపురం 2.6 ఎంఎం, గుడిబండ 16.2 ఎంఎం, అగళి 11.4 ఎంఎం, రొళ్ల 7.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రబీలో బోరు బావుల కింద సాగు చేసిన వరి, రాగి, మొక్కజొన్న తదితర పంటలు కోత దశలో ఉన్నాయి.అకాల వర్షంతో నష్టపోతామేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా .. వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం బోల్తా పడి, ఓ వ్యక్తి గాయపడిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకొంది, హైదారాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయి సుదర్శన్ ద్విచక్ర వాహనంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో పుట్టపర్తి మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడ్డాడు. అటుగా ప్రయాణిస్తున్న సోమందేపల్లి జెడ్పీటీసీ అశోక్ క్షతగాత్రున్ని, పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'భవిష్యత్‌కు పీఎఫ్ ఉపయోగకరం'

పెనుకొండ: పీఎఫ్ భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని పీఎఫ్ అధికారి శ్రీనివాసుబాబు అన్నారు. స్థానిక గ్లోబల్‌జెన్ పాఠశాలలో సోమవారం ఆయన పీఎఫ్‌పై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో భూమి ఉన్న ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పంటలు సాగు చేసి, ఆదాయం పొందాలని డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్ తెలిపారు. సోమవారం తురుకువాండ్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల ద్వారా రైతుకు నష్టమేనన్నారు. సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేస్తే తెగుళ్లను నివారించొచ్చన్నారు. ఏటీఎం, ఏగ్రేడ్ మోడల్ విధానంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలోయూనిట్ ఇన్‌చార్జ్ సుజాతమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గొడవలకు వెళ్లొద్దు

లేపాక్షి: అనవసరంగా గొడవకు వెళ్లొద్దని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ మునీర్ అహమ్మద్ ప్రజలకు సూచించారు. తిలక్‌నగర్ కాలనీలో సోమవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఇళ్లతోపాటు మద్యం విక్రయించేవారి నివాసాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలసిమెలసి జీవించాలన్నారు. అనంతరం బాల్యవివాహాలు, శక్తి యాప్, సైబర్ క్రైమ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు.

వేసవి శిక్షణ ప్రారంభం

సోమందేపల్లి: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మహబూబ్ బాషా సూచించారు. సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పావగడ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని గురుభవన్ మైదానంలో మల్బరీ శాఖ ఆధ్వర్యంలో చంద్రికలు, పిచికారీ యంత్రాలు తదితర పరికరాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. డా బీఆర్ అంబేద్కర్ అభివృద్ధి మండలి, చిన్న నీటి పారుదల శాఖ, తండా అభివృద్ధి మండలి, వడ్డెర అభివృద్ధి మండలి నుంచి పంపు మోటారు, విద్యుత్ పరికరాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పశు చికిత్స శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దేవరాజు అరస్ బీసీ వర్గాల అభివృద్ధి మండలి నుంచి మంజూరైన కుట్టు మిషన్లు లబ్ధిదారులకు అందించారు. పావగడ ప్రధాన చెళ్లకెరె క్రాస్‌లో దివంగత పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ కంచు విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, చంద్రశేఖర రెడ్డి తదితర కాంగ్రెస్, ఆర్య ఈడిగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

2 నుంచి దరఖాస్తు చేసుకోండి

హిందూపురం: మండలంలోని వివిధ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల్లో ప్రవేశానికి మే 2 నుంచి 19 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ గంగప్ప, ప్రసన్నలక్ష్మి తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను వారు ఎంపీడీఓ సరస్వతి, అలెస్కా ఆనందబాబుతో కలిసి విడుదల చేశారు.

ప్రతిభావంతులకు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు

లేపాక్షి: శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదుతున్న విద్యార్థిని సి.రక్షిత ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 591 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగరాజు, ఏఓ శ్రీలతతో పాటు పోలీసు అధికారులు విద్యార్థిని ఘనంగా సత్కరించారు. రక్షిత బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

వికాస్‌రెడ్డికి సన్మానం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురానికి చెందిన అనితాలక్ష్మి, మంజునాథ్ కుమారుడు కె.వికాస్‌రెడ్డి అనంతపురం జిల్లాలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 596 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహ, సిబ్బంది తదితరులు వికాస్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు మాట్లాడుతూ అనంతపురం కలెక్టర్ వినోద్ కుమార్ చేతుల తన కొడుకు మంజునాథ్‌ను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

అగళి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. సోమవారం మండల పరిధిలోని మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దాసేగౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు మెమొంటోలతో పాటు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్,జేడీపీటీసీ ఉమేష్ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.